ఆలయాలకు పటిష్ట భద్రత కల్పించాలి

- బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ

మాట్లాడుతున్న రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 16: దేవాలయాలకు ప్రభుత్వం పటిష్ట భద్రత కల్పించాలని బ్రహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ కోరారు. బుధవారం మెదక్‌కు విచ్చేసిన ఆయన జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేదవ్యాస్, మెదక్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు లింగమూర్తి శర్మ, వైద్య శ్రీనివాస్ శర్మతో కలిసి మాయా గార్డెన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల్లో విగ్రహాలు ధ్వంసం చేసిన ఘటనలు వెలుగులోకి రావడం దురదృష్టకరమన్నారు. విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. త్వరలో బ్రాహ్మణ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బ్రాహ్మణ సంఘాన్ని పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ సారథి, నాయకులు ప్రభాకర్ శర్మ, కిరణ్‌కుమార్ శర్మ, భాస్కరమూర్తి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే భక్తి భావన పెరుగుతుంది



ఆవాహిత దేవా పూజల్లో పాల్గొన్న భక్తులు

చేగుంట, అక్టోబర్ 16: ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలతోనే భక్తి భావన కలుగుతుందని మర్కుక్ పాండురంగ ఆశ్రమ పీఠాధిపతి యాజ్ఞానంద స్వామీజీ, విజయవాడ హనుమాన్ పీఠాధిపతి దుర్గప్రసాద్ స్వామీజీ పేర్కొన్నారు. మండలంలోని చందాయిపేటలో వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆవాహిత దేవతా పూజ, హోమం, అష్టోత్తర శత మన్యు సూక్త 108 రుద్ర మూల మంత్ర సూక్త హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పబ్బ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పబ్బ నాగరాణి నగేశ్, సిరిసిల్ల పూర్ణయ్య దంపతులు, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మల్లేశం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 16: జిల్లాలో వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం ఏరియా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కేంద్రాలు ప్రారంభించి, అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గతంలో గోనె సంచులు, లారీల సమస్య తలెత్తి రైతుల ఇబ్బందులకు గురయ్యారన్నారు. కేంద్రాల్లో టార్పన్లు, పొల్లు మిషన్లు, మంచి నీటి సౌకర్యం, హమాలీలను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో నాయకులు దేవయ్య, లచ్చాగౌడ్, బాలనర్సయ్య, ఆజయ్, నాగమణి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

వెల్దుర్తి, అక్టోబర్ 16: వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరి, వ్యవ సాయ కార్మిక సంఘం నాయకుడు నరేందర్ డిమాండ్ చేశారు. వెల్దుర్తి తహసీల్దార్ కృష్ణకు వినితి పత్రం అందజేశారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

పోలీసులతో వాగ్వాదం చేస్తున్న దామరచెర్వు గ్రామస్తులు

రామాయంపేట, అక్టోబర్ 16: గ్రామస్తుల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన కానిస్టేబుల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని దామరచెర్వు గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం రామాయంపేటలోని మెదక్ చౌరస్తా వద్ద నినాదాలు చేస్తూ రాస్తారోకో చేశారు. దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో గ్రామంలోని కొంత మందికి గొడవ జరిగింది. ఈ విషయంలో రామాయంపేట స్టేషన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ కల్పించుకుని దురుసుగా ప్రవర్తించి, యువకులపై కేసు నమోదు చేస్తానంటూ బెదిరించాడు. ఈ విషయంలో రామాయంపేటకు చేరుకుని కానిస్టేబుల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని గ్రామస్తులు రోడ్డుపై రాస్తారోకో, ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటరాజ గౌడ్, ఎస్సై బాలరాజు వారిని సముదాయించారు. కానిస్టేబుల్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని సీఐ, ఎస్సై తెలపడంతో ఆందోళన విరమించారు.

భూమికి బదులు భూమి ఇవ్వండి

ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

నర్సాపూర్, అక్టోబర్ 16: ట్రిబుల్ ఆర్‌లో భూ ములు కోల్పోతున్న రైతులకు భూమికి బదు లు భూమి లేదా మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని మండలంలోని చిన్నచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాల రైతులు ఆర్డీవోకు బుధవారం వినతి పత్రం అందజేశారు. బయట మార్కెట్‌లో తమ భూములు ఎకరానికి మూడు కోట్లు పలుకుతున్నదని, దానికి తగ్గట్టుగా కనీసం రెండు కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

ఉప తహసీల్దార్లకు శిక్షణ ఇస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, అక్టోబర్ 16: పట్టభద్రుల ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డిజిగ్నేటెడ్ అధికారులుగా నియమితులైన నర్సాపూర్ ఉప తహసీల్దార్లకు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 1, 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారందరూ అర్హులన్నారు. తమ డిగ్రీ సర్టిఫికెట్‌ను గెజిటెడ్ ఆఫీసర్ ద్వారా ధ్రువీకరించి, అటాస్టేషన్ చేయించి ఆన్‌లైన్‌లో గాని లేదా సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ఫారం 18 అందజేయాలన్నారు. ఉపాధ్యాయుల కౌన్సిల్ ఓటర్ నమోదుకు సెకండరీ స్కూల్, ఆపైన విద్యాలయాల్లో పనిచేసే వారు నవంబర్ 1, 2021 నాటికి మూడేండ్ల సర్వీస్ పూర్తి చేసుకోవాలన్నారు. వీరు ఫారం 19లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటర్ నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా పేర్కొన్నారు. డివిజన్‌లో ఇప్పటి వరకు మొత్తం 277 దరఖాస్తులు వచ్చాయని, అందులో 51 దరఖాస్తులు ఆమోదించామని తెలిపారు.

48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు

- సన్న వడ్లకు రూ.500 బోనస్
- జిల్లా వ్యాప్తంగా 473 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- రూ.15 కోట్లతో రామాయంపేట బీటీ రోడ్ల అభివృద్ధి
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు
- అక్కన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రామాయంపేట: అక్కన్నపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

పెద్దశంకరంపేట: కమలాపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పాపన్నపేట మండలం శానాయిపల్లిలో..

మెదక్ రూరల్: మెదక్ మండలం పాతూర్‌లో ..

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

రామాయంపేట, అక్టోబర్ 16: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని అక్కన్నపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో బీటీ రోడ్ల కోసం రూ.15 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 473 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ఐకేపీ సెంటర్లలో ధాన్యం విక్రయించాలన్నారు. మొదటి రకం వడ్లకు రూ.2350, రెండో రకానికి రూ.2325, సన్నవడ్లకు రూ.2300, రూ.500 బోనస్ కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రామాయంపేటలోని గొల్పర్తి గ్రామానికి చెందిన ఎర్రం రాములు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రూ.లక్ష 90వేల ఎల్‌వోసిని అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ, తహసీల్దార్ రజనీ కుమారి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ ఏసుగారి రమేశ్‌రెడ్డి, అల్లాడి వెంకటి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 16: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండలంలోని కమలాపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాయిని మధు, నారాగౌడ్, కుంట్ల రాములు, సంగమేశ్వర్, సుబాశ్‌గౌడ్, పెరుమాండ్లు, అంజిరెడ్డి, ఐకేపీ ఏపీఎం గోపాల్ ఉన్నారు.

ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటుంది

మెదక్‌రూరల్, అక్టోబర్ 16: ప్రభుత్వం ప్రతి గింజనూ కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. మెదక్ మండలం పాతూరులోఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యేతో పాటు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం మోహన్, డీఎం సివిల్ సప్లయి హరికృష్ణ, డీఎస్‌వో సురేశ్, ఏపీఎం ఇందిర పాల్గొన్నారు.

రైతు కష్టం దళారుల పాలు కావద్దు

పాపన్నపేట అక్టోబర్ 16: పాపన్నపేట మండలం శానాయిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ చందన ప్రశాంత్‌రెడ్డి, వెలుగు ఏపీఎం సాయిలు, త్యార్ల రమేశ్, మల్లన్న, గోవింద్‌నాయక్ ఉన్నారు. అనంతరం మల్లంపేట మాజీ సర్పంచ్ బాపురెడ్డి గృహ ప్రవేశంలో పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

అల్లాదుర్గం,అక్టోబర్ 16: ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఇన్‌చార్జి ఎంపీడీవో శంకర్ అన్నారు. మండంలోని గడిపెద్దాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఏపీఎం నాగరాజు, సీసీ ఆబేద్, ఏఈవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు నాటారు.. వీళ్లు నరికారు!

చండూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నరికేసిన చెట్లు

చిలిపిచెడ్, అక్టోబర్ 16: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అవి నేడు చెట్లుగా పెరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చెట్లను పూర్తిగా నరికేస్తున్నది. అధికారుల మధ్య సమన్వయ లోపంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. గ్రామ గ్రామానికి నర్సరీ ఏ ర్పాటు చేసి మొక్కలు పెంచారు. హరితహారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలు మొక్కలు నాటుతుంటే, విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని ఏపుగా పెరిగిన మొక్కలు, చెట్లను అడ్డంగా నరికేస్తున్నారు. మండలంలోని చండూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై, ప్రాథమిక పాఠశాలలో పదేండ్లుగా నాటిన మొక్కలు పెరిగి చెట్లుగా మారాయి. ఈ చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతున్నాయని అధికారులు చెట్లను పూర్తిగా నరికేశారు. దీంతో నీడ కూడా లేకుండా చేశారు.

చండూర్ గేట్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై నరికేసిన హరితహారం మొక్కలు

19న జిల్లాలో హైకోర్టు జడ్జి పర్యటన

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

మెదక్ అర్బన్, అక్టోబర్16: రాష్ట్ర హైకోర్టు జడ్జి ఈ నెల 19న మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గామాతను, మెదక్ చర్చిని దర్శించి, అల్లాదుర్గంలోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద తెలిపారు. జిల్లా న్యాయస్థానముల సముదాయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని, లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో రమాదేవి, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా వైద్యాధికారి శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే

చేగుంట, అక్టోబర్ 16: మండలంలోని సంకాపూర్‌లో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొన్నారు. నార్సింగి మండలంలోని సంకాపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు రాజాసింగ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంచనూరి రాజేశ్, నరేందర్, గోవర్ధన్ తదితరులున్నారు.

తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అభివృద్ధి, సంక్షేమంపై సమగ్ర సమాచారం

- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): ఆర్థిక, సామాజిక అభివృద్ధి, కీలక సూచికలను క్రోడీకరించి ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాల్లో రాష్ట్రం ఎలా పురోగమిస్తోందో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం 2024 తెలుపుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లోని ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం 2024 (తెలుగు) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. వ్యవసాయం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, విభిన్న రంగాల ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితి, వ్యూహాత్మక స్థానం, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, సహాయక విధానాలు గణనీయమైన పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలను ఈ పుస్తకంలో పొందుపర్చినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. ఈ పుస్తకం ఖరీదు ఒక్కటి రూ.150, ఇవి ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంటాయన్నారు. ముఖ్య ప్రణాళిక అధికారి బద్రీనాథ్, డీఈవో రాధాకృష్ణ, డీఎస్‌వో రాజిరెడ్డి, గణాంక సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్

కళలు సృజనాత్మకను పెంచుతాయి: డీఈవో

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 16: కళలు సృజనాత్మకతను పెంచుతాయని డీఈవో రాధాకిషన్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలను జిల్లా కేంద్రంలోని వెలుగు పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు వివిధ రకాల కళల్లో ఆసక్తిని కలిగి ఉండాలని, మనలోని కళలను చాటేందుకు కళా ఉత్సవ్ వేదికని అన్నారు. పోటీల్లో భాగంగా జానపద నృత్యం, చిత్రలేఖనం, వాయిద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, న్యాయ నిర్ణేతల కమిటీ కన్వీనర్ రామేశ్వర ప్రసాద్, ఉపాధ్యాయులు నర్సింగరావు, అంజాగౌడ్, మాధవరెడ్డి, ప్రవీణ్, వంశీ, శశిధర్‌గౌడ్, గోపాల్, లక్ష్మీప్రసన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కొలువుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

చిలిపిచెడ్‌లో నూతనగా ఎంపికైన ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇస్తున్న ఎంఈవో విఠల్

నూతన ఉపాధ్యాయుల నుంచి జాయినింగ్ రిపోర్ట్ స్వీకరిస్తున్న హెచ్ఎం అరుణ

పెద్దశంకరంపేటలో నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈవో వెంకటేశం

మెదక్ మున్సిపాలిటీ/నిజాంపేట/పెద్దశంకరంపేట/చిలిపిచెడ్, అక్టోబర్ 16: డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. జిల్లాలో 272 పోస్టులకుగాను 269 మంది అభ్యర్థులకు పోస్టింగులు కేటాయించారు. మరో మూడు పోస్టులు అనివార్య కారణాలతో పక్కన పెట్టారు. అల్లాదుర్గంలో 25, చేగుంట 3, చిలిపిచెడ్ 16, హవేళీ ఘనపూర్ 6, కౌడిపల్లి 6, కొల్చారం 9, మనోహరబాద్ 4, మాసాయిపేట 3, మెదక్ 21, నర్సాపూర్ 9, నిజాంపేట్ 5, పాపన్నపేట 22, రామాయంపేట 6, రేగోడ్ 29, శంకరంపేట(ఎ) 33, శంకరంపేట(ఆర్) 9, శివ్వంపేట 9, టేక్మాల్ 40, తూప్రాన్ 6, వెల్దుర్తి 8, మొత్తం 269 ఉపాధ్యాయులు మండలాల వారీగా విధుల్లో చేరారు. ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు ఎంఈవోలు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. మండలంలోని ఆయా పాఠశాలలకు ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని సూచించారు.

నేడు చేగుంటకు ఎమ్మెల్యే రాక

చేగుంట, అక్టోబర్ 16: మండలంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారని ఐకేపీ ఏపీఎం లక్ష్మి నర్సమ్మ బుధవారం తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మక్కరాజిపేట రోడ్డులోని బైపాస్ బ్రిడ్జి వద్ద రోడ్డును పరిశీలించి, ఉన్నత అధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం చందాయిపేటలో జరుగుతున్న వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొనున్నారు.

సుడి దోమతో వరి పంటకు నష్టం

చేగుంట, అక్టోబర్ 15: సుడి దోమతో వరి పంటకు ఎక్కువగా నష్టం జరుగుతుందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని నార్సింగి ఏఈవో విజ్ఞంభణ తెలిపారు. నార్సింగి మండలం నర్సంపల్లిలో సుడి దోమతో నష్టపోయిన పంటను బుధవారం పరిశీలించారు. సుడి దోమను నివారించేందుకు అవసరమైన మందులను పిచికారీ చేయాలని సూచించారు.

మాచారెడ్డి ఏవోగా వడ్ల పవన్‌కుమార్

రామాయంపేట, అక్టోబర్ 16: మండలంలోని రాయిలాపూర్‌కు చెందిన వడ్ల పవన్ కుమార్‌కు కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ఏవోగా ఉద్యోగం సాధించినట్లు రామాయంపేట ఏవో రాజ్‌నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పవన్ కుమార్‌ను అధికారులు, గ్రామస్తులు, స్నేహితులు సన్మానించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

చిలిపిచెడ్,అక్టోబర్ 16: మండలంలోని బద్రియ తండా వద్ద మెదక్-సంగారెడ్డి ప్రధాన రోడ్డుపై జిల్లా కేంద్రాలకు వెళ్లేందుకు రోడ్డు అధ్వానంగా తయారైంది. వర్షం పడితే ఈ దారి గుండా ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతున్నది. రాకపోకలకు అంతరాయం కలుగడంతో పాటు ప్రయాణికులు, వాహనాదారులు నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై గుంతలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

మానసిక వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

చిన్నశంకరంపేట, అక్టోబర్16: మానసిక వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్‌తో ఉపశమనం కలిగించవచ్చని అంటువ్యాధుల ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధు, ప్రిన్సిపాల్, మెడికల్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి, అక్టోబర్ 16: వెల్దుర్తిలో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన గుంటుకు విఠల్ నివాసంలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారంతో రెవెన్యూ అధికారుల దాడులు చేశారు. అనంతరం జిల్లా సివిల్ సప్లమ్ అధికారులకు సమాచారం అందించినట్లు తహసీల్దార్ తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE IST ADDL. JUNIOR CIVIL JUDGE COURT MEDAK AT : MEDAK
O.S.No: 718 of 2022

Between:
B.V.R. Prasad ...Petitioner/Plaintiff
And
Bakshi Jayaram & Others ...Respondent/Defendant's
To
1. Bakshi Jayaram, S/o. Late Bakshi Venkatram, Age: 45 Years, Occ: Business, R/o. H.No. 4-28, 4-29, Tekmal (Village), Tekmal (Mandal), Medak (District), Telangana-502 302 (Defendant No: 1).
2. Bakshi Lalithram, S/o. Late Bakshi Venkatram, Age: 43 Years, Occ: Business, R/o. H.No. 4-28, 4-29, Tekmal (Village), Tekmal (Mandal), Medak (District), Telangana-502 302, (Defendant No: 2).
3. Bakshi Jagatram, S/o. Late Bakshi Venkatram, Age: 40 Years, Occ: Business, R/o. H.No. 4-28, 4-29, Tekmal (Village), Tekmal (Mandal), Medak (District), Telangana-502 302, (Defendant No: 3).
4. Annasaram Prameela, D/o. Bakshi Rajaram, W/o. Late Ramkishan, Age:5 5 Years, Occ: Housewife, R/o. Andole (Post & Vil. &Mdl.), Medak (District), Telangana-502 273 (Defendant No: 9).

Whereas the above named plaintiff has filed the above suit for **Partition** against you and made you as Defendant and the Hon'ble Court has directed to publish this notice, to enable you to appear before the Hon'ble Ist Addl. Junior Civil Judge Court Medak, At: Medak in the above suit as such this Hon'ble Court pleased to post the above suit on **Dated 30-10-2024** for your appearance. Therefore you are hereby requested to appear before the Hon'ble Ist Addl Junior Civil Judge Court Medak, At : Medak at 10.30 AM **on Dated 30-10-2024** in person or by Pleader duly instructed to answer the claim, failing which the said suit will be heard and determined ex-parte

(By order of the Court)
M/s. Aditya Law Firm
Laxmikantham T Vukkalkar,
Pawan T Vukkalkar,
Manoj T Vukkalkar, Vinay T Vukkalkar,
Advocates, **9704829022.**